క్లుప్తంగా

పదవీవిరమణ వ్యక్తిత్వానికి కాదు

అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్



పదవి విరమణ పొందిన వారితో ఏసీపీ రవీందర్ రెడ్డి, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్

సిద్దిపేటకమాన్: పదవి విరమణ ఉద్యోగానికే కానీ వ్యక్తిత్వానికి కాదని దనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఏసీపీ రవీందర్‌రెడ్డి అన్నారు. పోలీసు కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన ఎస్‌ఐలు కనకయ్యగౌడ్, కొమరయ్య, ఏఎస్‌ఐ రఘును గురువారం పోలీసు అధికారులు అభినందించారు. అనంతరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి ఘనంగా సన్మానించారు. టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ పరిశీలన



విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

హుస్నాబాద్: కలెక్టర్ ఆదేశాల మేరకు నలుగురు సభ్యుల కమిటీ స్థానిక ఎస్టీ బాలికల వసతి గృహాన్ని గురువారం సందర్శించారు. కిచెన్ రూం, టాయిలెట్లను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ సరిగా అమలు కావడం లేదని, వార్డెన్ కూడా అందుబాటులో లేడని కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థినులు తమ దృష్టికి తేవాలని సూచించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైద్య, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.


జీవశాస్త్రం ఎంతో కీలకం



మాట్లాడుతున్న ఎంఈఓ కనకరాజు

దౌల్తాబాద్(దుబ్బాక): మన నిత్య జీవితంలో జీవశాస్త్రం ఎంతో కీలకమైనదని మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు అన్నారు. మండల పరిధిలోని ఇందూప్రియాల్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం సబ్జెక్టుపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన జరగాలన్నారు. కార్యక్రమంలో సమావేశంలో ప్రధానోపాధ్యాయులు అప్జల్ హుస్సేన్, జిల్లా రిసోర్స్ పర్సన్ రాం ప్రసాద్, స్వాతి, దివాకర్, నగేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక భద్రత అవసరం



అవగాహన కల్పిస్తున్న బాల్‌చంద్రం

గజ్వేల్‌రూరల్: యువత ఆర్థిక భద్రత దిశగా దృష్టి సారించాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అబ్రహం పిలుపునిచ్చారు. 'యువ పౌరుల కోసం ఆర్థిక విద్య' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయస్థాయి కార్యశాల గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకింగ్, షేర్లు, బాండ్‌లు, రియల్ ఎస్టేట్, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడం వల్ల ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆయా అంశాలపై వాణిజ్య విభాగాధిపతి డాక్టర్ బాల్‌చంద్రం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, అధ్యాపకులు ఉమారాణి, లక్ష్మి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



బోర్‌మోటార్‌ను ప్రారంభిస్తున్న దేవేందర్

దుబ్బాక: స్థానిక కాశీవిశ్వనాథ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ చైర్మన్ ఆకుల దేవేందర్ చెప్పారు. ఆలయం ప్రాంగణంలో గురువారం తన సొంత నిధులతో బోర్ వేయించి మోటారును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ, ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి పరుస్తానన్నారు. కార్యక్రమంలో పెద్దలు రాజమౌళి, నరేశ్, శ్రీనివాస్, సుభాష్‌రెడ్డి, సురేశ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నామ్‌కేవాస్తేగా గండిపూడ్చివేత

- ఏదుల్లచెరువు నుంచి వృథాగా పోతున్న సాగునీరు
- రాళ్లు అడ్డుపెట్టి, కాస్త మట్టిపోసి చేతులు దులుపుకున్న అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



ఏదుల్లచెరువు మత్తడివద్ద పడ్డ గండికి అడ్డుపెట్టిన రాళ్లు

ఇరిగేషన్ అధికారుల తీరు నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్న చందంగా తయారైంది. చెరువుల రక్షణ కోసం పనిచేయాల్సిన వారు ఏదో మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారు.

దుబ్బాక: పట్టణంలోని ఏదుల్లచెరువు మత్తడివద్ద భారీ గండిపడి వారం రోజులుగా సాగునీరు వృథాగాపోతోంది. ఇరిగేషన్ అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనిపై మూడు రోజుల క్రితమే సాక్షిలో 'ఏదుల్లచెరువుకు భారీ గండి' అనే శీర్షికన కథనం వెలువడడంతో ఉన్నతాధికారులు స్పందించారు. వెంటనే గండి పూడ్చాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

రాళ్లుపెట్టి.. మట్టిపోసి..

కాని స్థానిక అధికారులు మాత్రం చెరువుమత్తడి వద్ద పడ్డ గండికి అడ్డంగా నాలుగు రాళ్లు పెట్టి.. కొంచెం మట్టిపోసి వదిలేశారు. నామమాత్రంగా రాళ్లు అడ్డుపెట్టడంతో చెరువు నుంచి నీరు వృథాగా పోతూనే ఉంది. మళ్లీ వర్షం పడితే తూతూమంత్రంగా పూడ్చిన గండికొట్టుకు పోతుందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గండిపడి చెరువులో నీళ్లు చాలా వరకు ఖాళీ అయ్యాయని వానపడితే మళ్లీ గండికొట్టుకు పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని, కావాలనే నీళ్లు పోవాలని చూస్తున్నారా అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మత్తడి వద్ద పడ్డ గండిని పటిష్టంగా పూడ్చాలని, శిథిలమైన మత్తడిని పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



చెరువు మత్తడి వద్ద గండిపడి పోతున్న నీరు(ఫైల్)

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి

- అవుసులోనిపల్లి వద్ద నిర్వాసితుల ఆందోళన
- రోడ్డుపై బైఠాయించి నిరసన
- సంఘీభావం తెలిపిన వంటేరు ప్రతాప్‌రెడ్డి



రైతులకు సంఘీభావం తెలుపుతున్న ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): వర్గల్ ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన తమకు సరైన పరిహారం, ప్లాట్లు ఇవ్వలేదని, సాగుచేసిన పొలాలకు కూడా హఠాత్తుగా విద్యుత్ సరఫరా నిలిపివేశారంటూ భూ నిర్వాసిత రైతులు భగ్గుమన్నారు. మండల పరిధిలోని అవుసులోనిపల్లి రోడ్డుపై గురువారం వారు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. టీజీఐఐసీ అధికారులు వెంటనే పంటపొలాలు ఎండిపోకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల కోసం భూసేకరణకు తాము అడ్డుచెప్పడం లేదని, ప్లాట్లు రిజిస్ట్రేషన్, పరిహారం చెల్లించాలన్నదే తమ డిమాండ్ అన్నారు. వాటిని అధికారులు పట్టించుకోకుండా తమ భూములలో పంటలు సాగు చేసుకుంటే విద్యుత్ సరఫరా నిలిపివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పంట కాలం పూర్తయ్యేలోగా పరిహారం, ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పొలాలకు విద్యుత్ సరఫరా నిలిపేయడం సరికాదన్నారు. పంటకాలం పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరా కొనసాగించి, నిర్వాసిత రైతులకు ప్లాట్లు, పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి నిర్వాసితులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శుక్రవారంలోగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

దుబ్బాకటౌన్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తమ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణం మొదలు పెట్టిన వారికి ప్రభుత్వం విడతలవారీగా రూ.5 లక్షల అందజేస్తుందని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ చెప్పారు. రాయపోల్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రామారం గ్రామంలో ఇందిమ్మ ఇళ్లను గురువారం పరిశీలించారు. పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేసి, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం రామారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణంలో ఎదురయ్యే సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బిల్లులు రావడంలో ఆలస్యం అవుతుందని ఆమె దృష్టికి తీసుకురాగా సాంకేతిక సమస్య వల్ల కొందరికి జమ కాలేదని, త్వరలోనే అందరికీ జమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణమోహన్, ఎంపీడీఓ బాలయ్య, విద్యాధికారి సత్యనారాయణరెడ్డి, హౌసింగ్ ఏఈఈ అనసుద్దిన్, ఎంపీఓ శ్రీనివాస్, ఆర్‌ఐ రాజమల్లు, పంచాయతీ కార్యదర్శులు మాధవి, పరమేశ్వర్, విజయ్, సతీశ్ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ శిక్షణతో ఉపాధ్యాయులకు మేలు

నంగునూరు(సిద్దిపేట): బోధనా పరమైన శిక్షణతో ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందని శిక్షణ కోర్సు డైరెక్టర్ రామస్వామిగౌడ్ అన్నారు. నంగునూరు, దూల్‌మిట్ట ప్రభుత్వ పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో ఎదురౌతున్న సమస్యలను గుర్తించి వాటిని అధిగమించేలా నైపుణ్యం పెంచుకోవాలన్నారు. వెంకటయ్య, సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్లు అజయ్‌కుమార్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ దాతల చేయూత అభినందనీయం

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా సెక్టోరియల్ అధికారి రామస్వామి అన్నారు. నర్మేట మాజీ ఎంపీటీసీ శనిగరం బాబు, స్వాతి దంపతులు గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.18 వేలు విలువచేసే ఫ్రీ ప్రైమరీ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ దేశిరెడ్డి, హెచ్‌ఎం మనీష్‌కుమార్, తహసీమ్ సుల్తానా, సునీత తదితరులు పాల్గొన్నారు. అలాగే నంగునూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, నాగరాజు, యాదగిరి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల మౌలిక వసతుల కల్పన కోసం హెచ్‌ఎం జయపాల్ యాదవ్‌కు రూ.6,500 అందజేశారు.

◆ పూర్తిస్థాయిలో విలీనం చేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): హన్మకొండ జిల్లా వెలేరు మండలంలో కొనసాగుతున్న కన్నారం గ్రామాన్ని అక్కన్నపేట మండలంలో పూర్తిస్థాయిలో విలీనం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రామాన్ని విలీనం చేస్తూ ప్రాథమిక గెజిట్ విడుదలైందన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం అక్కన్నపేట మండల పరిషత్, విద్యశాఖ లాగిన్‌లో కన్నారం గ్రామం వచ్చిందన్నారు. మిగిలిన రెవెన్యూ, పోలీస్‌శాఖలో విలీనం చేయకపోవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి రెవెన్యూ సదస్సులకు గ్రామప్రజలు ఎటువైపు వెళ్లాలో తెలియని దిక్కుతోచని దుస్థితిలో ఉన్నామని వాపోయారు. ఈ విషయాన్ని మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్తామని బీఆర్‌ఎస్ నాయకుడు డప్పు నాగరాజుతో పాటు గ్రామస్తులు తెలిపారు.

◆ విద్యా వ్యవస్థను గాడిలో పెడుతున్న ప్రభుత్వం

మిరుదొడ్డి(దుబ్బాక): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భ్రష్టు పట్టిన విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెడుతోందని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామి గౌడ్, జిల్లా కార్యదర్శి ఏలూరి కమలాకర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ మద్యం మీదున్న శ్రద్ధ విద్య మీద లేదని వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అవి వేకానికి నిదర్శనమన్నారు. యాదగిరి, సుమలత, శ్రీధర్, సురేందర్‌రెడ్డి, వెంకట్, నరేష్, రమేష్, అహ్మద్, చందు తదితరులు పాల్గొన్నారు.

◆ పౌరహక్కులకు భంగం కలిగించొద్దు

కొమురవెల్లి(సిద్దిపేట): హక్కులకు భంగం కలిగించొద్దని ఎస్‌ఐ రాజు సూచించారు. మండలంలోని గౌరయపల్లిలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో కులవివక్ష రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆర్‌ఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ ప్రజల అభివృద్ధే లక్ష్యం

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రజల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. పలు పంచాయతీలలో రోడ్ల నిర్మాణానికి నిధులు కోసం కృషిచేసిన నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల హర్షం

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో మొదటి విడతగా రూ.లక్ష జమ కావడంతో హర్షం వ్యక్తం చేశారు. 17 మంది పునాది స్థాయి నిర్మాణాలు పూర్తి చేయడంతో గురువారం వారి ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ బ్లాక్ మాజీ అధ్యక్షుడు ముత్యాల సంజీవ్‌రెడ్డి నేతృత్వంలో ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. మల్లారెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు

కొమురవెల్లి(సిద్దిపేట): డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన వ్యక్తికి కోర్టు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ రాజు గురువారం తెలిపారు. కొమురవెల్లిలో బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో ఐనవోలుకు చెందిన గండవీని రాజు మద్యం తాగి ఆటో నడుపుతూ పట్టుపడ్డాడు. అతడిని చేర్యాల కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంబులెన్స్‌ల తనిఖీ

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర నాణ్యతా విభాగశాఖ తనిఖీ అధికారి జాన్ షాహిద్, జిల్లా మేనేజర్ శ్రీహరి రామకృష్ణ మండలంలో 108 అంబులెన్స్ సేవలను గురువారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో పరికరాలు, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మెరుగైన సేవలు అందిస్తున్న సిబ్బందిని ప్రశంసించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఇంగ్లిష్ బోధించేందుకు అతిథి ఉపాధ్యాయుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రత్యేక అధికారి స్రవంతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనుభవం కలిగి అర్హులైన వారు స్వయంగా పాఠశాలలో సంప్రదించాలని కోరారు. అలాగే 6వ తరగతి నుంచి 10వ తరగతిలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

టూటౌన్ ఎస్‌ఐ ఆసిఫ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సైబర్ మోసాల బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని టూటౌన్ ఎస్‌ఐ ఆసిఫ్ సూచించారు. శ్రీచైతన్య ఒకేషనల్ కళాశాలలో విద్యార్థినులకు చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా వేధించినా, అవమానకరంగా మాట్లాడినా వెంటనే డయల్ 100, షీ టీమ్ నంబరు 871266743కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ రహీమ్ హైమద్, అధ్యాపకులు, షీ టీమ్ సభ్యులు కిషన్, ఏఎస్‌ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, రజని, కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వద్దు

ప్రత్యేకాధికారి బాబునాయక్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని ప్రత్యేకాధికారి బాబునాయక్ అన్నారు. బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల వసతి గృహాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. బియ్యం, వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు పౌష్టికరమైన ఆహారాన్ని అందించేందుకు పెద్దపీట వేస్తుందని, సన్నబియ్యంతో భోజనం, నెలకు నాలుగుసార్లు నాన్‌వెజ్, ఉదయం, సాయంత్రం సమయాల్లో స్నాక్స్, పండ్లు, పాలు తదితర ఆహార పదార్థాలను అందిస్తున్నట్లు తెలిపారు.

సమన్వయంతో సాగుదాం..

అందుబాటులో ఉండండి

- 'స్వచ్ఛ్ సిద్దిపేట'నే లక్ష్యం
- మున్సిపల్ చైర్మన్ మంజుల



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మంజుల

సిద్దిపేటజోన్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ మంజుల పిలుపునిచ్చారు. మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అనేక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు వర్షం నీరు రోడ్డుపైకి రావడంపై ప్రశ్నించారు. స్పందించిన చైర్మన్ అధికారులు వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యలు ఉన్న ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వార్డ్ ప్రత్యేక అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. వార్డుల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నారని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డుల్లో ఫాగింగ్ చేయించాలని, బ్లీచింగ్ చల్లించాలని చెప్పారు. పట్టణంలోని గణపతి కుంట నుంచి మట్టి తరలింపుపై దర్యాప్తు జరింపించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. వినాయక చవితి, బతుకమ్మ సందర్భంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. అంతకుముందు పలు అంశాలపై సభ్యులు ప్రశ్నించారు. మున్సిపల్ అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కౌన్సిలర్లు కోరారు. అనంతరం అజెండా అంశాలను ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కాంగ్రెస్, బీజేపీల కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏకపక్షంగా అంజెండా రూపొందించినట్టు ఆరోపించారు.



ధారగుట్ట వద్ద మట్టి తవ్వకాలు

ధారగుట్టను మింగేస్తున్నారు..

యథేచ్ఛగా మట్టి తరలింపు

- అనుమతి లేకుండా తవ్వకాలు
- కాపాడండి: మిట్టపల్లి గ్రామస్తులు

సిద్దిపేటఅర్బన్: మండలంలోని మిట్టపల్లి శివారులో గల ధారగుట్టను అక్రమార్కులు తోడేస్తున్నారు. అక్రమంగా మట్టి తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి తరలింపును అడ్డుకొని ధారగుట్టను పరిరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు ఇటీవల ధారగుట్ట వద్దకు వెళ్లి పరిశీలించారు. తవ్వకాలు జరుగుతుండడాన్ని చూసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సంబంధిత రెవెన్యూ అధికారులు అక్కడికి చేరి తవ్వకాలు పరిశీలించి పనులు నిలిపివేయించారు.

చర్యలు తీసుకోలేదు..

అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండానే అధికారులు వెళ్లిపోయారని, వారితో మాట్లాడి వెళ్లిపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని యువకులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదేశించాం..

ఈ విషయమై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా తాము వెళ్లిన మాట నిజమేనని, పనులు నిలిపివేయించి అనుమతులు లేకుండా పనులు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆదేశించినట్టు చెప్పారు. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన సొంత పనులకు మట్టి తరలించుకుంటున్నాడని తెలిసిందని అయినా కూడా అనుమతి తీసుకోవాలని సూచించామని తెలిపారు.

నాచగిరిలో వేలం పాటలు

వర్గల్(గజ్వేల్): నాచగిరి క్షేత్రంలో వివిధ అంశాలపై గురువారం ఆలయ చైర్మన్ రవీందర్ సమక్షంలో ఈఓ విజయరామారావు బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలం ద్వారా సంవత్సరంపాటు 45 ఆలయ గదుల కిరాయి వసూలు, నిర్వహణను రూ.13,00,100తో పిట్ల ఆంజనేయులు దక్కించుకున్నట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నంబర్ 1ని నెలకు రూ.6వేలు కిరాయతో భాస్కరాచారి దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు.

వసతి గృహాల్లో రక్షణ కరువు

- సమస్యలు పరిష్కరించాలి
- డీబీఎఫ్ రాష్ట్ర నేత ఏగొండస్వామి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏగొండస్వామి

గజ్వేల్: వసతి గృహాల్లో విద్యార్థులకు రక్షణ కరువైందని, భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ ఎస్టీ బాలుర వసతి గృహాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రహరీ లేక హాస్టల్లో పాములు, కుక్కలు, పందులు, తేళ్ల యథేచ్ఛగా సంచరిస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు ప్రమాదం అంచుల్లో భయంభయంగా కాలం గడుపుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 45 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు హాస్టళ్లల్లో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, పంపిణీ చేయలేదని, అలాగే ట్యూటర్ల నియామకం జరగలేదని వాపోయారు. ఏఎన్‌ఎంల ద్వారా నిరంతరం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయించడం లేదన్నారు. తాజా కూరగాయలతో వండిన భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు చంద్రం తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించండి



మాట్లాడుతున్న కౌన్సిలర్ బ్రహ్మం

సిద్దిపేటకమాన్: మున్సిపల్‌శాఖలో జరుగుతున్న అవినీతిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కౌన్సిలర్ బ్రహ్మం, బీఆర్‌ఎస్ నాయకుడు మణిదీప్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ చట్టంలోని లొసుగులను అడ్డుపెట్టుకుని చెక్‌ల రూపేణ ప్రజాధనాన్ని కొందరు దారి మళ్లించారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ ప్రజల అత్యవసరాల కోసం మాత్రమే చెక్కులు జారీ చేయాల్సి ఉంటుందని, ఇంటి పన్ను పునఃపరిశీలన పేరిట పాలక వర్గాన్ని తప్పు దోవ పట్టించి పట్టణ పరిధిలోని కమర్షియల్ భవనాల ఆస్తి పన్నులను తగ్గించి బల్దియా ఆదాయానికి గండి కొట్టారని వాపోయారు. ఈ అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థిని జి.అవంతిక రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. సిద్దిపేటలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. అండర్–10 విభాగంలో అవంతిక స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ దక్కించుకుంది. రెండో స్థానంలో నిలిచిన ఎర్రోళ్ల ప్రణీత సిల్వర్ మెడల్ సాధించింది. అలాగే 60 మీటర్ల పరుగు పందెంలో సైతం ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. హైస్కూల్‌కు చెందిన ఎర్రోళ్ల మనోహర్ 60 మీటర్ల పరుగు పందెంతోపాటు స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాడు. క్రీడల్లో రాణించేలా విద్యార్థులకు శిక్షణనిస్తున్న పీఈటీ ఉప్పలయ్య, సహకరిస్తున్న తల్లిదండ్రులు, హెచ్‌ఎం జయప్రకాశ్ రెడ్డి, పెద్ది విఠల్‌ను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. విద్యార్థులు అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.